స్కెచ్

# సాంబయ్య జీవితంలో ఒకరోజు

"పరంధామయ్య"

భద్రయ్య తలుపుతట్టిన చప్పుడు విని వులిక్కిపడ్డాడు "ఇంత పొద్దున్నే వచ్చే అతిథులెవరుంటారు? తప్పక యింటి యజమాని అయివుంటాడు. వోరి పీడ ఘుంపతెగ పొద్దు పొడవకముందే తగులుకొన్నాడు వంటింటిలో నక్కి లేనని చెప్పించటానికి కూడా ఎవరు లేరు. నా కర్మ కాలితే శ్రీమతి గారుకూడా యీ విపత్కర సమయంలోనే పలాయనం చిత్తగించాలా. ఇంట్లో ఆడదిక్కంటూ లేక పోవడం ఎంత ప్రమాదం. అయినా చూస్తాం ఇంతకూ వీడెవడో-" భద్రయ్య గారీవిధంగా భయాందోళనాసమ్మిళితహృదయుండైవుండగా "భద్రం వోరే నీకు పుణ్యముంటుంది. తలుపు తీ. సైడు కాలువ గబ్బుకు నిలువ లేకున్నా"

"వోరి వెధవా! నీవటరా! భయపడి చస్తినే" భద్రయ్య దుప్పటి ముసుగు తొలగించి ఒళ్లు విరుచుకుని లేచి తలుపు తీశాడు.

"ఏం రా. యింకా లేవలేదు. అన్నట్లు ఎవరూ లేరా?"

"వారంరోజుల క్రిందట శ్రీమతిగారు ఏవో కొన్ని డిమాండ్సు పంపి. అవి శాంక్షను కాకపోతే తీవ్రపరిస్థితులేర్పడగలవని అల్టిమేటమ్ పంపడం, అట్లనే యీ గృహప్రాంగణాన్నుంచి వాకౌటు చేయటం సంభవించింది."

"అయితే కొంపతీసి స్వయంపాకమా యేం?"

"లేదురా, అక్కాయమ్మ హోటలు."

"ఇంతకూ మీ ఆవిడగారికి అంత ఆగ్రహం తెప్పించే పని ఏం జేశావ్?"

"ఏమో చేయుపనిలేదోయ్. శ్రీవారికిది మామూలు అయిపోయింది. తాను వేసుకొన్న ప్రణాళికకు ఏమాత్రం లోటు కలిగినా బ్రహ్మాండంగా ఆజిటేట్ చేయడం, కొంపలోనుండి నిష్క్రమించటం జరుగుతూవుంది. కున్నచీరెల్లో ఒకటి చినిగిందట. నిమిషాలమీద దాన్ని భర్తీ చేయాలంటుంది. ఎక్కడ తెచ్చేది నా పాడె, దమ్మిడీ చేతిలో లేక నానా అవస్థలు పడుతూంటె?"

"ఇంత సింపిల్ కాజ్. వెరి హారిబుల్. అయినా యీ మధ్య ఏ గృహంలో జూచినా కల్లోలాలె. మొన్నొకసారి శ్రీమన్నారాయణ విషయం చెప్పాను జ్ఞాపకముందీ?"

"జ్ఞాపకం లేదే ఏమని?"

"నేననుమానించినట్టే రవంతైనా మార్పు లేకుండా జరిగింది."

"ఎవరికి? నీకా శ్రీమన్నారాయణకా?"

"శ్రీమన్నారాయణకురా"

"ఏం జరిగిందేమిటి?"

"భారమైన యీ సంసారాన్ని విడిచి పారిపోయాడు."

"అరె. నిజం!"

"అక్షరాలా నిజం. అసలీవిధంగా జరుగుతుందని నాకు ముందే తెలుసు" సాంబయ్య నిర్లక్ష్యంగా అన్నాడు.

"ఏడిశావు. అసలు వాడి విషయం సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం నీకేమొచ్చింది."

"వాడి పరిస్థితుల్ని వాడి మనోధైర్యాన్ని అంచనా వేసిన తరువాత నాకా దృఢనమ్మకం కలిగింది."

"వాడు పారిపోయినట్లు నమ్మకం?" భద్రయ్య అనుమానంగా మొహం పెట్టి అడిగాడు.

"ఊళ్ళో వాళ్ళంతా నమ్మి పొద్దుపుచ్చుకుంటున్నారు. వాడిభార్య సైతం నమ్మి ఏడుస్తూంది. ఇంతకన్నా ప్రూఫ్ ఏం కావాలి."

"వాడికింత విరక్తి ఎందుకు కలిగిందో."

"కలుగకేం జేస్తుంది. భార్యామణి స్నో బుడ్లకి ఫేస్‌పౌడర్లకి వాడికొచ్చే ఆదాయంలో

సగం అయిపోతుంది అంతే కాదు. అనుమానించతగిన..."

"ఛా! ఛా! అంత మరీ ఎక్స్ట్రీమ్స్‌కు పోకు నీకు పుణ్యముంటుంది."

"నీకేం తెలుసురా ఆ మనిషి విషయం. అటుపోయి విను."

"తల దువ్వుకోని కొంచెం నాజూగ్గావుంటే చాలు. వెధవ అనుమానాలన్నీ కలుగుతయ్. మానవజన్మే అనుమానాల సంపుటమేమో. ఆ అందం తమకు లేదనే ఈర్ష్య. ఇంకేం కథల వల్ల వెధవ పుకార్లంతా పుట్టిస్తారు" భద్రయ్య హృదయపు లోతుల్ని చూస్తున్నట్లు గంభీరంగా అన్నాడు.

"సోషలిస్టుల మాదిరి ప్రతిదానికి అనుమానమేరా నీకు"

"లోక్ పార్టీ మాదిరి ఏ ఎండకా గొడుగు పట్టే రకం నీది." భద్రయ్య చివాలున లేచి కూర్చొని అగ్గిపెట్టెతీసి సిగరెట్టు వెలిగించాడు.

"ఊరికే దబాయిస్తే కాదు అదెట్లనో కాస్త చెప్పు చూస్తాం."

"ఏదో మాట వరసకు అంటే కాదు. సోషలిస్టులకి నాకూ వచ్చిన అనుమానమేదో ఏడువు చూస్తాం."

"ఏడవటానికి నాకేం కర్మరా. సలక్షణంగా చెప్తా విను. ఏవిధంగా మద్రాసు సోషలిస్టులు అటు కాంగ్రెసులో కలిస్తే అభివృద్ధినిరోధక మనే సందేహంతోను యిటు ఫ్రంటులో కలిస్తే వ్యక్తిస్వాతంత్ర్యం నశిస్తుందనే అనుమానంతోను తల్లడిల్లుతూ త్రిశంకు స్వర్గంలో వున్నారో, అలాగే నీవుకూడా స్పష్టంగా కళ్ల యెదుట కనబడే విషయంలో అనుమానానికి తావిచ్చి బుర్ర చెడగొట్టుకుంటున్నావు."

"ఏడిశావు. నీ రాజకీయ పరిజ్ఞానం అఘోరించినట్టే వుంది. ఇంకా లోకపార్టీతో సరితూగే అనేక పోలికలు నీలో వున్నయ్. కాంగ్రెసుకు వ్యతిరేకం నాపార్టీ అంటూ వోట్లు సంపాదించాడు పూజ్యుడైన రంగా కాని యిప్పుడు వారేమంటున్నారు? ప్రజాస్వామికానికి తీరని ముప్పు వాటిల్లగలదని పెడబొబ్బలు పెడుతూ కాంగ్రెసులో చేరటానికి అనంతమైన తిప్పలు పడుతున్నాడు. అలాగే నీవు రెండు నెలల క్రిందట శ్రీమన్నారాయణ భార్య అనూరాధయొక్క అందాన్ని యోగ్యతను అద్భుతంగా పొగిడావు కాని యీ వాడు ఆమెమీదనే స్కాండిల్సు. ఏదో చెంపపెట్టు తిని ఉంటావు."

"యీ మాదిరి అనుమానంతో కుళ్ళుతావనే నిన్ను సోషలిస్టన్నది."

"యీ మాదిరి నిమిషానికో ప్లేటు మారుస్తావనే నిన్న లోక్ పార్టీ అన్నది."

"పోరా సోషలిస్టూ."

"పోరా లోక్ పార్టీ-" భద్రయ్యకు రొప్పు వచ్చింది. సాంబయ్యకు అలుపొచ్చింది

"ఛా! ఛా! ఎందుకురా యీ అనవసరపు వాగుడు."

"అవునెందుకీ వృథా వాగ్వాదం"

"ఆ మనిషి విషయం ఏమాత్రం తెలిసినా నీవలా మాట్లాడవు."

"అవునదినిజమే. నాకు రవంతకూడ తెలియదు."

"వాణ్ణి కాల్చి రాసి రంపాన పెట్టి వుంటు దిరా. లేకుంటే పెళ్ళాన్ని బిడ్డల్ని కొంపను విడిపించి ఎవరుపారిపోతారు. వాడికంత విరక్తి కలిగేపని ఏదో చేసివుంటుంది. వగవాడికి విరక్తి కల్గటం సామాన్యమా?"

"ఏదో ఒక భయంకరమైన అనుమానం వాడికి కలిగివుంటుంది."

"యిలా కొంప విడిచి పారిపోవటం మొగజాతికే అవమానం."

"అందునా, ఈ వీధినుండే మగపురుగులకిది తీరని అప్రతిష్ట."

"అప్రతిష్టా? తలగొట్టేసి నట్టయిందంటే అతిశయోక్తి కాదు. వొక సామాన్య స్త్రీ యీ ఝుంఝూమారుతానికంతా కారణమయిందంటె..."

"సిగ్గుచేటురా సాంబూ, సిగ్గుచేటు"

"భద్రం యిక తలయెత్తుక తిరగలేం."

"సాంబూ యిది మనకు పరీక్షాసమయం. ధైర్యంతో యీ సమస్యను ఢీకొని ఛేధించాలి. అలా మోహం వేలాడేస్తే"

"వుహూ లాభంలేదు, ఏదోఒకటి చేయాలి."

"ఏదో ఒకటి చేయాలి. ఆలస్యమయితే స్పిరిట్ పోతుంది."

"గోఅన్. ఐయామ్ రెడీ. శ్రీమన్నారాయణను పట్టి తెచ్చిందాకా నేను కాఫీముట్టను."

"ఆపని జరిగిందాకా నేను సిగరెట్టు కాల్చను."

"వాణ్ణి పట్టుకొచ్చి దీని పొగరణచాలి."

"దాని ఎముకలన్నీ చితుక బొడిపించాలి."

"ఈపని సాధించాలంటే అనేక అడ్డంకు లున్నయ్."

"ఎన్నో కష్టాలను సైహూమాదిరి అధిగమించాల్సి వస్తుంది."

"ఎంతో త్యాగం అవసరం."

"ఎంతో ధైర్యం కావాలి."

"అయితే నేం ఆంధ్రులం."

"ఆరంభంలో శూరులం."

"ఛా! ఛా! అలా నిరాశావాదిగా మాట్లాడకు."

"రైమ్‌కోసం అన్నా లేరా."

"ఇది మహా సీరియస్‌గా తీసుకోవలసిన విషయం"

"విపరీత విపత్కర పరిస్థితి ఏర్పడినట్లు ఒక ఆర్డినెన్సు పాస్ చేయిస్తే."

"అబ్బే! ఆర్డినెన్సులు పాసయ్యేది కమ్యూనిస్టులకు. దీనికి కాదు."

"వచ్చినట్లు దీనికి మనమే నడుముకట్టాలి."

"కట్టాలీ? ఎప్పుడో కట్టాం. ఇక కర్తవ్య నిర్వహణకు యితోధికంగా కృషి చేయాలి."

"రాయలసీమకు ముస్లీ యితోధికంగా పాటుపడినట్లు."

"అబ్బే! అలా లాభం లేదు. ఫార్వర్డు మార్చ్. ఒకటే పురోగమనం"

"కమ్యూనిస్టుల మాదిరి."

"అదెస్పిరిట్ అదె డిసిప్లిన్. భద్రం మంచి నీళ్లు కావాలిరా, నోరెండిపోయింది."

"నాకు పైత్యం వచ్చేట్టుంది. కాఫీ వచ్చే వుపాయం."

"కాఫీ తాగందే ఏ పని చేయలేం."

ఇంతలో భద్రయ్యా యింటి ముందు బండి ఆగిన చప్పుడైంది. మిత్రులిద్దరు వాకిలిగుండా తొంగి చూశారు. భద్రయ్యా భార్య ఆతని పిల్లలు శ్రీమన్నారాయణ వస్తున్నారు.

"ఏమిట్రా నీ కూతలు" భద్రయ్యా రహస్యంగా అన్నాడు సాంబయ్యతో.

"ఇక్కడే బుజావు చేస్తాగా."

"ఏంరా భద్రం మీ ఆవిడ జాబు రాసిందట నే. స్టేషనుకన్నా రాకూడదూ. ఏం వెలగబెడుతున్నావు" శ్రీమన్నారాయణ అన్నాడు.

"జాబా! అందందే?"

"నే నుండబట్టి సరిపోయే. లేకపోతే ఆ పిల్లలు, స్టేషనులో బండిలేకపోయె. బజారుకొచ్చి బండి పంపి, తీసుకొస్తున్నా" అంటూ శ్రీమన్నారాయణ కూర్చొని బీడి ముట్టించాడు. భద్రయ్యా భార్య యింట్లోకి వస్తూనే, "ఏందీ కొంప? నాలుగు రోజులు కొంపలో లేకుంటే."

"ఈ కొంప కేం? అనంతమైన సిగరెట్టు ముక్కలతో ఏకాంతపు యోగ సమాధిని జ్ఞప్తికి తెస్తుంది. శ్రీవారి కబురందివుంటే వూడ్చించి వుంచేవాడిని. ఈలా నిర్లక్ష్యంగా వుండినందుకు అప్పుడే డైరెక్టు ఏక్షను తీసుకుంటారా ఏం కొంపదీసి"

"వచ్చీ రాకముందే రగడ పెట్టుకుంటున్నావేం?"

"రగడకేముంది కాని, నీ వెక్కడనుంచిరా? నిజంగా నాకు జాబంద లేదు. లేకుంటే స్టేషనుకు రాకపోవటానికి ముంచుకు పొయ్యే పనిమాత్రం యేముంది?"

"నేను అన్నయ్యా దగ్గరకు పనుండి పోయి యీ బండికే వచ్చా."

"మాడరా? విధవ పుకారు. అందుకే లోకులు కాకులు అన్నారు."

"పుకారా అదేమిట్రా?" శ్రీమన్నారాయణ ఆతురతో అడిగాడు.

'ఏముంది. తమరు పలాయనం చిత్తగించారని. అయినా, అంతటి ప్రబల కారణం ఒకవేళ మీ ఆవిడ యెంత ..."

"ఎంత? కానీ నీళ్లు నములుతా వేమిరా? చెప్పి ఏడుపు. ఏందిరా భద్రం వాడి అవస్థ."

'ఏదో నీ కామెమీద అనుమానం కలిగి నట్టు."

"ఏమిటీ మళ్ళా కుయ్. ఆ కూత."

"అబ్బెబ్బె! ఏం లేదు. ఏదో పుకారు. వెధవలు అంటుంటారు. ఆ విషయమే మేం కూడ అనుకున్నాం. ఏంరా భద్రం."

సాంబయ్యకు ముచ్చెమటలు పోసినై. మాట తడబడింది.

"వెధవలు ఎవరో అనుకుంటే, మీకూ బుద్ధి లేదేం. అయినా నాది కూడా కొంచెం పొరబాటుందిలే."

"ఏమిటో అది."

"ఆ రోజేదో మామూలు కీచులాట జరిగింది దినమూ వుండేదేగా. వోపికుండాలే గాని, యీ చాలీ చాలని కొంపల్లో భార్యా భర్తల మధ్య కీచులాటలకేం కొదవా? ఎటూ అన్నయ్య దగ్గిరకి పోవాలసిన పనుంది కదా? అని బుద్ధి పుట్టినట్లు ఆ స్టంటేశాను. "నే నీకొంపలో క్షణముండను" అంటూ వెళ్ళాను. దానికింత రాద్ధాంతం చేసింది కామాల్ను ఏమైనా వూళ్లో వాళ్ళకి బుద్ధిలేదురా."

"అదుగో మీ ఆవిడ కూడ వస్తూంది. ఏంరా అలా అయిపోయింది?"

అనూరాధ వస్తూనే శ్రీమన్నారాయణవద్ద కూలబడ్డది వెక్కి వెక్కి యేడుస్తూ.

"పిచ్చిదానా! ఎక్కడికి పోతానను కున్నావ్? అబ్బే! యిదేందిలా అయిపోయినావ్"

"ఇంటికి రారూ?"

"ఎందుకు రాను?"

"రారని చెప్పారెవరో. మరి యిందాకనగా వచ్చారే ఎందుకు రాలేదు?"

"ఇక్కడేదో మాట్లాడుకుంటున్నాము. అంతలో నీవూవచ్చావు. ఎవరు చెప్పారేమిటి నేను రానని?"

"ఒకరేం, ఎందరోవచ్చి చెప్పారు. ఇక భరించలేక వచ్చేశాను. అబ్బా! ఎందుకు ఏడ్పించారు"

"పిచ్చిదానా మనమేడిస్తేనే యితరులకు ముచ్చట. ఛాన్సుకోసం కనిపెట్టుకొనివుండి ఏమాత్రం అవకాశం దొరికినా యీలా ఏడిపిపిస్తూవుంటారు."

"మీరుమాత్రం"

"పొరబాటైంది. యికెప్పుడూ"

ఇంతలో భద్రయ్య భార్య అందరికి కాఫీ పట్టుకొచ్చింది. భద్రయ్య సాంబయ్య కృతజ్ఞతతో ఆమెవైపు చూస్తూ కాఫీ కప్పులకోసం ఎగబడ్డారు.

"ఉండండి నేనూ కొంచెం మాట్లాడాలి. ఎవరికివారు వేరే ప్రణాలికలు వేసుకొని ప్రతిష్ఠ కోసం తమపట్టే నెగ్గాలన్నంత కాలం యీ గృహచ్ఛిద్రాలు తప్పవు. ఇవి పోవాలంటే. ఒకేఒ. కామన్ ప్రోగ్రామువుండాలి. అందరికీ నచ్చేలో ఒక కనీస కార్యక్రమంతో భార్యాభర్తలు తమ తమ జీవితాలు పురోగమించేటట్లు చేయాలి అని అనూరాద చేయిపట్టుకొని "అక్కయ్య బావను నేను తెచ్చా. నాకేం యిస్తావ్. అనడిగింది."

"అరే మరచిపోయానే! ఏం భద్రం. ఓ రాగాన రాలేదురా మీ ఆవిడ. బ్రతిమలా తీసుకొచ్చా. నాకేం యిస్తావు?" శ్రీమన్నారాయణ నవ్వుతూ అన్నాడు.

"మ్యూచువల్ అసిస్టెన్స్, సహకారాన్ని యిచ్చిపుచ్చుకోటం అంటే యిదేనేమో. బాకీకి బాకీ చెల్లు" భద్రం నవ్వుతూ అన్నాడు.

"ఆ యిక తీసుకోండి కాఫీ. కాఫీ రుచిలో కామన్ ప్రోగ్రాం మాత్రం మరచి పోకండి" అందరూ నవ్వారు సాంబయ్య మినహా.

పరస్పరభిన్నమైన రాజకీయ సిద్ధాంతాల విషవాయువులు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్న యీ తరుణంలో అమూల్యమైన కొన్ని మానవత్వపు విలువల పునరుద్ధరణకు కవులు, రచయితలు పూనుకోవాలి. ప్రభుత్వపు జోక్యానికి అతీతమైన కొన్ని వ్యక్తిస్వాతస్సిద్ధమైన స్వేచ్ఛలు మానవునికున్నాయనీ, ప్రేమ, కరుణ, పరస్పర ఆకర్షణ, యివే మనుగడకు జీవగర్రలనీ ప్రబోధించి, రచయితలు మానవహృదయంనుండి భయాన్ని బహిష్కరించాలి.—రాబర్ట్ గార్హామ్ డేవిస్.